క్లుప్తంగా

నిధుల రికవరీ



సామాజిక తనిఖీ సభలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శిరివెళ్ల: ఉపాధి పథకం పనుల్లో మేటీలు చేసిన పొరపాట్లకు దుర్వినియోగమైన రూ.14,234ని అధికారులు రికవరీ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం సాయంత్రం ఎంపీపీ నాయక్ వసీం అధ్యక్షతన ఉపాధి పథకంపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఈ ఏడాది జరిగిన ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ పనులపై తనిఖీ బృందం సభ్యులు తమ నివేదికలను చదివి వినిపించారు. పనుల్లో మస్టర్లలో మేటీలు పొరపాట్లు చేశారని వెల్లడి కావడంతో దీంతో.. సంభందిత మేటీల నుంచి రికవరీ చేశామని అధికారులు తెలిపారు. ఇక నుంచి పొరపాట్లు జరగకుండా చూడాలని డ్వామా ఏపీడీ భాస్కర నాయుడు, ఏపీఓ రామసుబ్బయ్యను ఆదేశించారు. ఏపీడీ బాలాజీనాయక్, క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాధర్, ఎంపీడీఓ సుబ్బన్న, పీఆర్ ఏఈ రవికుమార్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు పాల్గొన్నారు.

ఇరుముడితో శబరిమలకు

రుద్రవరం: మండల కేంద్రం నుంచి 30 మంది అయ్యప్ప భక్తులు బుధవారం శబరిమలకు బయలు దేరారు. దీక్షా కాలం పూర్తి కావడంతో ఇరుముడి సమర్పించేందుకు శబరిమలకు బయలు దేరారు. గ్రామంలోని పడమటి వీధి నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు బంధువులు,కుటుంబ సభ్యులు ఊరేగింపుగా వీడ్కోలు పలికారు.

బొజ్జాను విడుదల చేయాలి



నంద్యాలలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

నంద్యాల (సెంట్రల్): రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డిని వెంటనే విడుదల చేయాలని సమితి సభ్యులు బుధవారం పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. ఆయన అరెస్టు ప్రజాస్వామ్య మానవహక్కుల ఏర్పడి నినాదాలు చేశారు. కృష్ణా జలాల పున: పంపిణీపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంతో సీమకు తీరని న్యాయం జరుగుతుందన్నారు. రాస్తారోకోలో సమితి ఉపాధ్యక్షుడు వైఎన్.రెడ్డి, రామచంద్రారెడ్డి, సీనియర్ న్యాయవాది శంకరయ్య, బెక్కం రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభం



ఆళ్లగడ్డలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణంలోని 14, 33 వార్డుల్లో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి బుధవారం ప్రారంభించారు. దేవనగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో జరిగిన శిబిరంలో 453 మందికి వైద్య సేవలు అందించగా, ఎంఎస్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ శిబిరంలో 467 మందికి వైద్య సేవలు అందించారు. దేవనగర్లో ఇద్దరిని , ఎంఎస్ నగర్లో 20 మందికి కంటి వైద్యానికి రెఫర్ చేశారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు భరోసా

ఆళ్లగడ్డ: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దస్తగిరిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని అర్బన్ హెల్త్సెంటర్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు.

వాసవి క్లబ్ అధ్యక్షురాలి ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల వాసవి క్లబ్ అధ్యక్షురాలిగా శ్రీలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన ఎన్నికలో సభ్యులు ఆమెను ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ 36 మంది మహిళలు సభ్యులుగా ఉంటారని, త్వరలో పట్టణంలో జరగబోయే కార్యక్రమాల వివరాలను తెలియజేస్తామని చెప్పారు.

రేపు వైఎస్సార్ పింఛన్ కానుక

దొర్నిపాడు: మండలంలో ఈనెల 5వ తేదీన వైఎస్సార్ నూతన పింఛన్ కానుకను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుర్రారెడ్డిపల్లె సచివాలయంలో 14, చాకరాజువేముల 8, దొర్నిపాడు –1కు 8, దొర్నిపాడు –2లో 2, కొండాపురంలో 3, క్రిష్టిపాడులో 4, డబ్ల్యూ గోవిందిన్నెలో 2, డబ్ల్యూ కొత్తపల్లెలో 6 వొప్పున మొత్తం 47 నూతన పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' ..

రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం భాగంగా మండలంలో ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. 5న క్రిష్టిపాడు 12న డబ్ల్యూ గోవిందిన్నె , 23న గుండుపాపల, 30న కొండాపురం, ఫిబ్రవరి 9న చాకరాజువేముల, 13న బుర్రారెడ్డిపల్లె, 23న దొర్నిపాడు–2 పరిధిలో నిర్వహిస్తామన్నారు.

జగనన్న మేలు జీవితంలో మరువలేం

'నా పేరు ఉప్పరి వెంకటలక్ష్మి. నంద్యాలలోని 42వ వార్డులో నివాసం ఉంటున్నాం. ఒక్కగానొక్క కుమారుడు వెంకటరమణకు చిన్నతనంలోనే గుండెకు రంధ్రం ఉందని వైద్యులు తెలిపారు. డోసెలు మేస్తూ జీవనం సాగించే మాకు ఆపరేషన్ చేయించే స్థోమత లేదు. అయితే ఆరోగ్యశ్రీ ద్వారా హైదరాబాద్లో ఆపరేషన్ చేయించాం. ఆరు నెలల క్రితం కాళ్లు, చేతులు వాపులు వచ్చాయి. వైద్యులు పరీక్ష చేసి రెండు కిడ్నీలు చెడిపోయాయని చెప్పారు. వైద్యం కోసం కర్నూలు వెళ్లగా వైద్యులు నంద్యాలకు వెళ్లాలని సూచించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మా అబ్బాయి డయాలసిస్ చేస్తున్నారు. వారం క్రితం కౌన్సిలర్ శిరీష, వార్డు వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ కిరణ్కుమార్ను కలిసి సమస్య తెలియజేయగా వెంటనే పింఛన్కు దరఖాస్తు చేయించారు. వారంలోగా మాకు పింఛన్ రూ.10వేలు అందించడమే కాకుండా ఎలాంటి ఖర్చు లేకుండా వైద్యాన్ని అందిస్తున్నారు. ఇంత సాయం చేసిన జగనన్న మేలు జన్మలో మరిచిపోలేం'.



పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు..



'నాపేరు షేక్ మౌలాబీ. కొనేళ్లుగా నంద్యాల పట్టణం వీసీ కాలనీలో నివాసం ఉంటున్నాం. నా భర్త హుసేన్సా అనారోగ్యంతో మృతి చెందడంతో ఇంటి పెద్దను కోల్పోయాను. ఆయన సంపాదన మీద ఆధారపడి జీవించే నాకు వారు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. సీఎం వైఎస్ జగన్ వితంతు పింఛన్ ద్వారా నాకు ప్రతి నెలా రూ.3వేలు ఇంటి పెద్ద కొడుకులాగా అందించి ఆదుకుంటున్నాడు. ఆయనను దేవుడు చల్లగా చూడాలి'.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

- దేశంలో రూ.3వేల పింఛన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే
- ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే తలుపు తట్టి పింఛన్లు ఇస్తున్నాం
- నంద్యాల పట్టణంలో కొత్తగా 329 మందికి పింఛన్లు
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్రెడ్డి



నంద్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి



శిరివెళ్లలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, చిత్రంలో గంగుల

నంద్యాల(సిటీ): నాడు.. టీడీపీ హయాంలో అవ్వాతాతలు పింఛన్లు పొందడానికి ఎన్ని కష్టాలు పడ్డారో స్వయంగా చూసి.. నేను ఉన్నాను, నేను విన్నాను అని వారికి భరోసా ఇచ్చిన జగనన్న నేడు ఆ మాటను నిలబెట్టుకున్నారు. వృద్ధులకు అంత్య దశలో ఆర్థిక తోడ్పాటునందించే పింఛన్లను దశల వారీగా పెంచుకుంటూ రూ.3వేల వరకు ఇస్తామని చెప్పిన మాట మేరకు పెంచి చూపించారు. ముదుసలి మారిసేలా ప్రతి నెలా ఒకటో తేదీన వారి తలుపు తట్టి పింఛన్ సొమ్ము అందించి వారి మనస్సులు గెలుచుకున్నారు. వైఎస్సార్ పింఛన్ల పెంపు వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన కమిషనర్ రవిచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్ రూ.3వేలకు పెంచి ఉదయం 5 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి మాత్రమేనన్నారు. టీడీపీ సానుభూతి పరులకు కూడా అర్హతను గుర్తించి వివక్షకు తావులేకుండా పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పుడు మీ ఇళ్ల వద్దకు వచ్చి సీఎం జగనన్న, శిల్పా కుటుంబాలపై దుష్ప్రచారం చేస్తారని, వారి వలలో పడొద్దని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, ఏపీఎస్ఐడీసీ ఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, దృశ్యకళల డైరెక్టర్ సునీతామృతరాజ్, కౌన్సిలర్లు, వార్డు వైఎస్సార్సీపీ ఇన్చార్జులు, అధికారులు పాల్గొన్నారు.

పింఛన్లపై దేశానికి ఏపీ ఆదర్శం

శిరివెళ్ల: సామాజిక పింఛన్ల మంజూరు, పంపిణీ, పెంపుపై దేశానికే మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 113 మందికి కొత్తగా పింఛన్ సొమ్ము అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో జగనన్న ఇచ్చిన రూ.3 వేల వరకు పింఛన్ పెంచుతానని ఇచ్చిన హామీ నెరవేర్చారని చెప్పారు. పింఛన్లు, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పింఛన్ల కోసం గతంలో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు పెట్టిన టీడీపీ నేడు మేమూ కూడా అందజేస్తామని అబద్ధపు ప్రచారం చేస్తుందని నమ్మి మోసపోవద్దని సూచించారు.



శిరివెళ్ల సభకు హాజరైన లబ్ధిదారులు

హామీలపై బాబును నిలదీయండి

ఎన్నికలు సమీపిస్తుండటంతో మోసం చేయడానికి చంద్రబాబు నాయుడు, ఆయన పార్టీ నాయకులు జనం మధ్యకు వస్తున్నారని, గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై నిలదీయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రజలను కోరారు. రైతు, డ్వాక్రా సంఘాల రుణమాఫీ అమలు కాలేదని, మళ్లీ నేడు అదే గ్యారంటీల పేరిట కొత్త నాటకానికి టీడీపీ తెరలేపిందని విమర్శించారు. గత ఎన్నికలలో గ్యాస్పై రూ. వంద సబ్సిడీ ఇస్తానని చెప్పారు.. ఆమలైందా అన్ని ప్రజలను ప్రశ్నించగా..లేదు అని ముక్త కంఠంతో సమాధానమిచ్చారు. వారు కేవలం హామీలతో సరిపెడితారని, జగనన్న మాత్రం నెరవేర్చి దేశానికే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి నెల 34,220 మందికి పింఛన్ల పంపిణీ అవుతున్నాయని, ఇందుకు నెలకు రూ.8.16 కోట్లు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నరహరి, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హబీబ్, మండల ఉపాధ్యక్షులు దీపుల అనూప, మండల మాజీ ఉపాధ్యక్షుడు గాజుకృష్ణారెడ్డి, సర్పంచులు సాలమ్మ, సుభహన్, జింకల నాగన్న, రఘునాథరెడ్డి, శివారెడ్డి, పెద్ది రమణ య్యారెడ్డి ఎంపీడీఓ మహబూబ్ బాషా, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

– ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రైతు ఉద్యమాన్ని రాజకీయం చేయొద్దు

- బొజ్జా అరెస్టుతో వైఎస్సార్సీపీకి సంబంధం లేదు
- 2016 కేసులో కోర్టు వారెంట్పై మాపై నెపం వేస్తారా?
- 2022లో భారీ ఉద్యమం చేసినా రైతులపై కేసులు పెట్టలేదు
- ఎమ్మెల్యే శిల్పా రవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డిని అరెస్టు చేస్తే ప్రతిపక్ష పార్టీల నాయకులు వైఎస్సార్సీపీపై బురద జల్లుతూ రైతు ఉద్యమాన్ని రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్రెడ్డి మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని శిల్పా సహకారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ఉద్యమం పార్టీలకు అతీతంగా జరుగుతుందని, ఇందులో తమ పార్టీ నాయకులు కూడా పాల్గొంటున్నారని, బొజ్జాను అరెస్టు చేసి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని టీడీపీ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయనపై 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేసు నమోదైందని, 7సంవత్సరాల తర్వాత కోర్టు ఇచ్చిన వారెంట్తో పోలీసులు అరెస్టు చేస్తే దాన్ని తమ పార్టీ పై ఎలా నింద వేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల గైడ్ లైన్స్ ప్రకారం పెండింగ్ కేసులు క్లియర్ చేసే సందర్భంలో పోలీసులు అరెస్టు వారెంట్ విషయాన్ని పలుమార్లు వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అరెస్టు వారెంట్ను రీకాల్ చేసుకోవాలని పోలీసులు చెప్పినా వారెందుకు తీసుకోలేదో తెలపాలని నిలదీశారు. అరెస్టు చేసిన వెంటనే బెయిల్ వచ్చే అవకాశం ఉన్నా రైతు సంఘం నాయకులు బెయిల్కు ఎందుకు దరఖాస్తు చేసుకోలేదన్నారు. 2022లో సిద్ధేశ్వరం వద్ద అలుగు ఉన్నా భారీ ఎత్తున రైతుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టినా తమ ప్రభుత్వం చిన్న కేసు కూడా నమోదు చేయలేదని గుర్తు చేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని రైతులను తప్పుదోవ పట్టించి లబ్ధి పొందేందుకు ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, ఇలాంటి రాజకీయాలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ విజయశేఖర్రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, నాయకులు శ్రీరాములు, ఉమామహేశ్వరరెడ్డి, జగదీశ్వరరెడ్డి, బిల్లలాపురం శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్



మీట నొక్కి విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నంద్యాల(అర్బన్): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానం సమీపంలో రూ.3.62 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్స్టేషన్ను ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న జనాభాను దృష్టి పెట్టుకుని వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సేవలను అందించేందుకు ప్రభుత్వం సబ్ స్టేషన్ను ఏర్పాటు చేసిందన్నారు. మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్ శశికళరెడ్డి, వైస్ చైర్మన్లు పాంషావలి, గంగిశెట్టిశ్రీధర్, దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, కౌన్సిలర్ షేక్ సంజీద, విద్యుత్ శాఖ ఈఈ రమణారెడ్డి, డీఈఈ ఆంజనేయరాజు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ హరిగోపాల్

ఉయ్యాలవాడ : నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ హరిగోపాల్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈఈ మాట్లాడారు. మండలంలో ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. త్వరగా ఇళ్లను నిర్మించుకునేలా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నంద్యాల డివిజన్ పరిధిలోని 15 మండలాలకు 19,716 గృహాలు మంజూరు కాగా 11,217 ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. ఈ నెలాఖరుకు 2,713 నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు సమష్టిగా కృషి చేస్తున్నామన్నారు. హౌసింగ్ డీఈ నాగరాజు, ఏఈ నరసింహారావు, పరిపాలనాధికారి పార్థసారథి, వర్క్ ఇన్స్పెక్టర్ షాదీక్బాషా పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా..

దొర్నిపాడు: గెలుపే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా క్రీడలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓఆర్డీ శ్రీనివాసులు బుధవారం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. యువకులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో తలపడుతున్నారు.



దొర్నిపాడులో పట్టు విడవకుండా మిడ్లైన్ తాకుతున్న రైడర్

విద్యార్థి అదృశ్యం



మంగళి హేమంత్

ఆళ్లగడ్డ: అహోబిలం గ్రామానికి చెందిన మంగళి హేమంత్ (17) అనే విద్యార్థి అదృశ్యమయ్యాడని రూరల్ ఎస్ఐ నరసింహులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన మంగళి దస్తగిరి కుమారుడు హేమంత్ నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులుగా కళాశాలకు వెళ్లక పోవడంతో కళాశాల నిర్వాహకులు తండ్రికి తెలియజేశారు. ఆయన పలుచోట్ల విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్

ఉయ్యాలవాడ : ఉజ్వల పథకం ద్వారా రేషన్ కార్డు కలిగిన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ప్రభుత్వం అందజేస్తుందని ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండలంలోని గోవిందపల్లె, బోడెమ్మనూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు నిర్వహించి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.పంచాయతీ కార్యదర్శులు నరేష్కుమార్, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

భూ రీసర్వేపై గ్రామ సభలు

దొర్నిపాడు: మండలంలో జరిగిన మొదటి విడత జగనన్న భూరక్ష– భూ రీసర్వేలో పొరపాటుచేసుకున్న హెచ్చుతగ్గులపై జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయప్రకాష్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 5వ తేదీన కొండాపురం, 9న గుండుపాపల గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు తగిన ధ్రువపత్రాలను జతపరిచి దరఖాస్తులు అందజేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటరావు, మండల సర్వేయర్ మల్లయ్య, వీఆర్వోలు రాధమ్మ, సావిత్రి, మురళి, సాంబశివుడు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండల కేంద్రానికి చెందిన మౌలాలి బుధవారం ఇంటి ముందు కల్లాపు చల్లే పొడిని నీటిలో కలుపుకొని తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి నంద్యాల ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా ఆర్థిక సమస్యల కారణంగా మద్యం మత్తులో ఆఘాయిత్యానికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉయ్యాలవాడ: గోవిందపల్లె గ్రామానికి చెందిన బాలఓబయ్య(30) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన మాదిగ బాలఓబయ్య డిసెంబర్ 26న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం డిసెంబర్ 29న కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వదిన పెద్దక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, సర్వశిక్ష అభియాన్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు హిదయతుల్లా కోరారు. బుధవారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వెంకటలింగం కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే శిల్పా రవికి వినతి పత్రం అందజేశారు.

అంగన్వాడీలు..

అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు రఘురామమూర్తి, రమేష్, సీఐటీయూ జిల్లా నాయకులు ఏసురత్నం, నాగరాజు కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్, వెల్ఫేర్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు షబా, నిర్మలమ్మ, గౌస్, నరసింహ, భాస్కర్రెడ్డి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

గోస్పాడు: పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గోవింద నాయక్ తెలిపారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో బుధవారం గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

నివాళి

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామ ఎంపీటీసీ వరికూటి నాగవెంకట రాముడు యాదవ్ సతీమణి విజయలక్ష్మి అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పింఛన్ల పంపిణీ

గోస్పాడు: మండలంలోని సాంబవరం గ్రామంలో బుధవారం సర్పంచ్ బజయ్య, ఎంపీటీసీ బోరెడ్డి భారతి పింఛన్లు పంపిణీ చేశారు.

మన పథకాలు దేశానికే ఆదర్శం



విద్యుత్ సబ్స్టేషన్ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్రెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలం బాచేపల్లెలో రూ.4.52 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ను బుధవారం ప్రారంభించారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఆళ్లగడ్డ: రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణ శివారులోని కదప, నంద్యాల జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి వచ్చే రోడ్లను బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ఆస్కారాలు ఉన్న ఏపీ గోడౌన్, కాచింతల క్షేత్రం సమీపంలో సర్వీస్ రోడ్లు నిర్మించాలని చెప్పారు. ఇందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఆర్డీవో శివారెడ్డి, సీఐ రమేష్బాబు, మున్సిపల్ కమిషనర్ రమేష్బాబు, హైవే అథారిటీ అధికారులు ఉన్నారు.

బ్యాంకు ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో దస్తగిరి రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎన్జీఓ కాలనీలోనున్న శ్రీగురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అభ్యర్థులు 2023 ఏడాదికి గానూ రీజనల్ రూరల్ బ్యాంక్ (ఆర్ఆర్బీ), ఐబీపీఎస్ బ్యాంక్లలో 115 ఆఫీసర్స్, 200కు పైగా క్లరికల్ ఉద్యోగాలు సాధించారని సంస్థ చైర్మన్ వి.దస్తగిరి రెడ్డి బుధవారం తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే అధికంగా ఆఫీసర్స్, క్లరికల్ ఉద్యోగాలను తమ విద్యార్థులు సాధించారన్నారు. 1989 నుంచి 2023 వరకు సంస్థ నుంచి 4256 మంది విద్యార్థులు బ్యాంక్ ఉద్యోగాలు సాధించారని చెప్పారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌళికిరెడ్డి పాల్గొన్నారు.

5 నుంచి రీ సర్వే సమస్యలపై అర్జీల స్వీకరణ

నంద్యాల: జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద మొదటి, రెండవ విడతల్లో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 5వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించి రీ సర్వే సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 11 గ్రామాలు, రెండవ విడతలో 73 గ్రామాల రీ సర్వే పూర్తయిందని, ఆయా గ్రామాల్లో కొలతల్లో ఏవైనా సమస్యలు ఉంటే 5 నుంచి 10వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి అర్జీలు స్వీకరిస్తామన్నారు. గ్రామ సభ షెడ్యూల్, గ్రామంలో అర్జీలు స్వీకరించే ప్రదేశం, బృంద సభ్యుల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని తహసీల్దార్లను ఆదేశించామన్నారు. గ్రామ సభలో తీసుకున్న అర్జీలను ఏర్పాటు చేసిన గ్రామ బృంద సభ్యులు ఈనెల 16 తేదీ వరకు అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. స్వీకరించిన అర్జీలను ఈ నెల 17 నుంచి 21వ తేదీ లోపు రీ సర్వే పున: సమీక్షించి, పరిష్కార నివేదికలను కలెక్టర్ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రీబాయి పూలే





సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం, అధ్యాపకులకు అవార్డులు అందజేసిన దృశ్యం

నంద్యాల(సిటీ): విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని పశ్చిమ రాయలసీమ సమాజ్వాదీ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ పాండురంగ యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో దేశపు తొలి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే 193వ జయంతి సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శివప్రసన్నయాదవ్తో కలిసి ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ జిల్లా కార్యదర్శి రాజేష్, సురేష్ బాబు, వెంకటాద్రి పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో బుధవారం డాక్టర్ బాబాసాహెబ్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 193వ సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ చైర్మన్ కొమ్ముపాలెం శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలకు, బహుజనులకు విద్య లేకపోవడంతో తొలిసారి గుర్తించిన మహాత్మా జ్యోతిబా పూలే భార్య సావిత్రీ బాయిని విద్యావంతురాలిగా తీర్చిదిద్దారన్నారు.అనంతరం మహిళా అధ్యాపకులు 15మందికి అవార్డులు అందజేశారు.డీఎఓ సునీత, దళితసమాఖ్య నంద్యాల మండల అధ్యక్షులు క్రిష్ణ, ప్రేమ్కుమార్, గుర్రప్ప, నరసింహులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే న్యూవిజన్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోస్పాడు: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను బుధవారం మనంగా నిర్వహించారు. స్థానిక హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంఈఓ అబ్దుల్ కరీం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్, హెచ్ఎం నాగలక్ష్మి అధ్యక్షులు ఉపాధ్యాయులను సన్మానించారు.

చాగలమర్రి: మహిళా విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే సేవలు మరువరానివని హెచ్ఎం ఎం.కోటయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రుద్రవరం: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎం సుబ్బరావ యాదవ్, ఏపీయూఎస్ కార్యదర్శి మల్లికార్జునరావు,ప్రవీణ్కుమార్, రామాంజనేయులు కలిసి ఎంఈఓ శ్రీలక్ష్మి, ఆలమూరు పాఠశాలకు చెందిన రమణమ్మ,స్థానిక పాఠశాలకు చెందిన నాగలక్ష్మి,ప్రియానిబెల్లె పాఠశాలకు చెందిన వెంకటలక్ష్మికి ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను సన్మానం సత్కరించారు. ఏపీమోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సంగీత నాగేశ్వరరావు అధ్యాపకులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

ఉయ్యాలవాడ : మహిళా అభ్యున్నతి, విద్య కోసం సావిత్రీబాయిపూలే ఎనలేని కృషి చేశారని ఎంఈఓ వీరప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం పూలే జయంతి వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మాధవి, శైలజ కుమారిని సన్మానించారు.